వందేండ్లు నడిచే అణు బ్యాటరీ

సముద్రం, అంతరిక్ష పరిశోధనల్లో కీలకం

బీజింగ్, మార్చి 15: వందేండ్ల పాటు నిరంతరాయంగా పనిచేసే అణు బ్యాటరీని చైనా పరిశోధకులు ఆవిష్కరించారు. బలహీనమైన రేడియోధార్మిక ఐసోటోప్ కార్బన్-14 అనే పదార్థంతో దీన్ని తయారు చేశారు. రేడియోధార్మిక పదార్థాల ఎమిషన్ ద్వారా ఇది విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. చార్జింగ్ లేకుండానే దశాబ్దాల పాటు సేవలందిస్తుంది. చైనాలోని గన్సు ప్రావిన్స్‌లో ఉన్న నార్త్ వెస్ట్ నార్మల్ యూనివర్సిటీ, బెటా ఫార్మాటెక్ సంయుక్తంగా ఈ బ్యాటరీని అభివృద్ధి చేశాయి. 50 ఏండ్ల జీవితకాలంతో అభివృద్ధి చేసినప్పటికీ అసాధారణ పరిస్థితుల్లోనూ వందేండ్ల పాటు సేవలందిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. సిలికాన్-కార్బన్ సమ్మేళనంతో కూడిన సెమీకండక్టర్‌తో చేసిన ఈ బ్యాటరీ -100 డిగ్రీల నుంచి 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలను తట్టుకుంటుందని అంటున్నారు. ధ్రువప్రాంతాలతో పాటు అంతరిక్షంలోనూ ఇది ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తుందని విశ్వసిస్తున్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పేస్‌మేకర్స్, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్ఫేసెస్ లాంటి వైద్య అవసరాలను కూడా ఇది తీరుస్తుంది. భవిష్యత్తులో దీని తయారీని మరింతగా పెంచాలని భావిస్తున్నారు. అందుకు కార్బన్-14 ఉత్పత్తిని పెంచేందుకు ఐసోటోప్ సెపరేషన్ టెక్నాలజీ అభివృద్ధిపై యూనివర్సిటీ సన్నాహాలు చేస్తున్నది.

2026లో మార్స్ మిషన్: మస్క్

2029లో మానవ సహిత యాత్ర

న్యూయార్క్, మార్చి 15: 2026లో మార్స్ మిషన్ చేపట్టనున్నట్టు స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ఎలాన్ మస్క్ వెల్లడించారు. స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన స్టార్‌షిప్ వ్యోమనౌక వచ్చే ఏడాది చివర్లో అంగారకుడిపైకి దూసుకెళ్తుందని తెలిపారు. ఆ వ్యోమనౌకలో టెస్లా సంస్థ అభివృద్ధి చేసిన హ్యూమనాయిడ్ రోబో 'ఆప్టిమస్'ను కూడా పంపిస్తున్నట్టు వెల్లడించారు. ఆ మిషన్ ల్యాండింగ్ విజయవంతమైతే, 2029 లేదా 2031లో మానవ సహిత యాత్ర చేపడతామని మస్క్ తమ కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలో వెల్లడించారు. .

మానవ అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు...

మార్స్ యాత్రపై మస్క్ ఎప్పటినుంచో పని చేస్తున్నారు. అంగారక గ్రహంపై కాలనీల ఏర్పాటు గురించి గతంలోనూ చాలాసార్లు మాట్లాడారు. అంగారక గ్రహంపై స్వయం సమృద్ధి గల మానవ కాలనీలను సృష్టించడం ద్వారా అణు యుద్ధాలు, ప్రకృతి విపత్తులు వంటి ముప్పుల నుంచి మానవ అస్థిత్వాన్ని, నాగరికతను కాపాడుకోవచ్చని ఎన్నోసార్లు చెప్పారు. అందుకు అవసరమైన స్పేస్‌క్రాఫ్ట్, జీవించేందుకు మౌలిక వసతుల కల్పన లాంటి టెక్నాలజీపై స్పేస్ ఎక్స్ పని చేస్తున్నది. అయితే, అమెరికా నూతన అధ్యక్షుడు ట్రంప్ మాత్రం అంగారకుడిపై మానవులను పంపించే మిషన్ తమ మొదటి ప్రాధాన్యం కాదని పేర్కొనడం గమనార్హం.

10 రోజులు పడుకుని ఉంటే 4.7 లక్షలు

యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఆఫర్

న్యూఢిల్లీ, మార్చి 15: ఏ పనీ చేయకుండా 10 రోజుల పాటు అలా పడుకుంటే మీకు సుమారు రూ.4.72 లక్షలు (5 వేల యూరోలు) ఇస్తామంటూ యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) ఆఫర్ ఇచ్చింది. వాటర్ బెడ్‌పై పది రోజులపాటు పడుకోబెట్టి వీరిని పరీక్షించనున్నారు. అంతరిక్షయానంలో మానవ శరీరంపై పడే ప్రభావాలను అంచనా వేసేందుకు ఈ ప్రయోగం నిర్వహిస్తున్నారు. ఫ్రాన్స్‌లోని టౌలౌస్‌లోని మెడెస్ స్పేస్ క్లినిక్‌లో ఈ ప్రయోగం చేపడుతున్నారు. ఇందులో భాగంగా బాత్‌టబ్‌ల మాదిరి ఉండే కంటైనర్లలో పది మందిని పడుకోబెట్టారు. వీటిని వాటర్‌ప్రూఫ్ ఫ్యాబ్రిక్‌తో కవర్‌చేశారు. దీంతో వారికి తడి అంటదు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వ్యోమగాములు తేలియాడినట్టుగానే వీరు కూడా అదే అనుభూతి పొందుతారు. బాత్‌రూమ్, ఇతర అవసరాలకు వలంటీర్లను తాత్కాలికంగా ట్రాలీలోకి బదిలీ చేస్తారు. అయితే వారు అప్పుడు కూడా వెనక్కి వాలిన పొజిషన్‌లోనే ఉండాలి. అయితే భోజన సమయంలో ఫ్లోటింగ్ బోర్డు, నెక్ పిల్లోను సమకూరుస్తారు. వారు తమ ఫోన్లను తమతోనే ఉంచుకోవచ్చు. కావాల్సిన వారితో మాట్లాడవచ్చు. పది రోజుల తర్వాత వారి శారీరక స్థితి ఎలా ఉందో పరిశీలిస్తారు.

క్షణాల్లో డూప్లికేట్ కీస్

ఔరా అనిపిస్తున్న వెండింగ్ మెషీన్

న్యూఢిల్లీ, మార్చి 15: డూప్లికేట్ తాళం చెవి తయారు చేయించుకోవాలంటే ఎంత ప్రయాసపడాలో అందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోకి వచ్చే ఉంటుంది. అయితే డూప్లికేట్ తాళం చెవిని క్షణాల్లో తయారు చేసే ఓ మెషీన్ గురించి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైన ఓ వీడియో నెటిజన్లను షాక్‌కు గురిచేయడమే కాదు ఔరా అనిపిస్తోంది. ఏటీఎం లా ఉన్న వెండింగ్ మెషీన్ వీడియోని అమెరికాలో నివసించే తన్వీర్ షేక్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఎటువంటి తాళం చెవినైనా చిటికెలో తయారుచేయడం ఈ మెషీన్ ప్రత్యేకత. ఇంటి తాళం చెవులతోపాటు, వాహనాలు, బీరువాల కీస్, యాక్సెస్ కార్డులను కూడా తయారు చేయగలదు ఈ వెండింగ్ మెషీన్. ప్రత్యేకంగా తాళం చెవులను తయారుచేసే విధంగా ఈ మెషీన్‌ను డిజైన్ చేశారు.

వారాంతంలో ఆపరేషన్లు చేసుకుంటే అధిక ముప్పు!

న్యూఢిల్లీ, మార్చి 15: వారం మొదట్లో చేసుకునే శస్త్ర చికిత్సల కంటే, వారం చివర్లో శుక్రవారం శస్త్ర చికిత్స చేసుకునే వారికి అనారోగ్య సమస్యలు, మరణ ముప్పు అధికంగా ఉంటుందా? అంటే అవుననే అంటున్నారు కెనడాకు చెందిన కొందరు పరిశోధకులు. సర్జరీ చేసుకున్న రోజు, సమయం రోగుల ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుందన్న అంశాన్ని వీరు నిర్ధారించారు. శస్త్రచికిత్స చేసుకున్న సమయం కీలక పాత్ర పోషిస్తున్నదని, శస్త్రచికిత్స భద్రతను మెరుగుపర్చడానికి షెడ్యూలింగ్ పద్ధతులను పరిగణనలోకి తీసుకోవాల్సిన ప్రాధాన్యతను వివరిస్తున్నదని వీరి ఫలితాలు రుజువు చేశాయి. సర్జరీ తర్వాత రోగులకు 30 రోజులు, 90 రోజులు, ఏడాది తర్వాత ఆరోగ్య పరిస్థితులు ఎలా ఉన్నాయన్న అంశాన్ని వైద్యులు పరిశీలించారు.

డ్రైవర్ లేని బస్!

బార్సిలోనా: ఈ వారమంతా బార్సిలోనాలోని సాహసవంతులైన ప్రయాణికులు డ్రైవర్ రహిత బస్‌లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు! రెనాల్ట్ కంపెనీ తన స్వయం చాలిత బస్‌కు ట్రయల్ రన్ నిర్వహిస్తుండటంతో వారికి ఈ అవకాశం లభించింది. నగరంలోని రద్దీ ప్రాంతంలో ఈ బస్ లేన్ మారే ముందు పద్ధతిగా బ్రేక్ వేస్తూ ప్రమాదాల బారిన పడకుండా ముందుకు సాగుతున్నది. విరైడ్ కంపెనీతో కలిసి ఈ ప్రొటోటైప్ బస్‌ను రెనాల్ట్ అభివృద్ధి చేసింది. ఈ బస్‌ను భవిష్యత్తు బస్‌గా అందులో ప్రయాణించిన ఓ విద్యార్థిని(18) అభివర్ణించింది. ఈ విద్యుత్తు బస్ గంటకు 40 కిలోమీటర్ల వేగంతో 120 కిలోమీటర్ల వరకు రీచార్జ్ అవసరం లేకుండా ప్రయాణిస్తుంది. 10 కెమెరాలు, 8 సెన్సార్ల సాయంతో తన మార్గాన్ని గమనిస్తూ ఈ బస్ ముందుకు సాగుతుంది.

41 దేశాలపై ట్రావెల్ బ్యాన్!

ట్రంప్ సర్కారు యోచన ▪ జాబితాలో ఉత్తరకొరియా, అఫ్గానిస్థాన్ తదితర దేశాలు

వాషింగ్టన్, మార్చి 15: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన దుందుడుకు చర్యలతో ప్రపంచ దేశాలను హడలెత్తిస్తున్న డొనాల్డ్ ట్రంప్.. మరో కీలక నిర్ణయానికి సిద్ధమయ్యారు. దాదాపు 41 దేశాలకు చెందిన పౌరులపై అమెరికా ప్రయాణ ఆంక్షలు విధించనున్నట్టు సమాచారం. ఈ దేశాలను మూడు వేర్వేరు గ్రూపులుగా అమెరికా ప్రభుత్వం విభజించనున్నది. మొదటి గ్రూపులో అఫ్గానిస్థాన్, సిరియా, క్యూబా, ఉత్తర కొరియా సహా మొత్తం 10 దేశాలు ఉన్నాయి. వీటిపై పూర్తిస్థాయి వీసా సస్పెన్షన్‌ను ట్రంప్ ప్రభుత్వం విధించనున్నది. రెండో గ్రూపులో ఎరిట్రియా, హైతీ, లావోస్, మయన్మార్, దక్షిణ సూడాన్ ఉన్నాయి. ఈ ఐదు దేశాలపై పాక్షిక వీసా సస్పెన్షన్‌లు ఉంటాయి. పర్యాటక, స్టూడెంట్ వీసాలపై ఇది ప్రభావం చూపనున్నది. ఇతర ఇమ్మిగ్రెంట్ వీసాలపై కొన్ని ఆంక్షలు విధించే అవకాశం ఉంది. మూడో గ్రూపులో పాకిస్థాన్, భూటాన్, మయన్మార్ సహా మొత్తం 26 దేశాలు ఉండనున్నాయి. 60 రోజుల్లోగా తమ లోపాలను సరిదిద్దుకోని పక్షంలో ఈ దేశాలపై అమెరికా వీసాల జారీ పాక్షికంగా నిలిచిపోనున్నది. ఈ జాబితాలో మార్పులు చేర్పులు ఉండవచ్చని, అమెరికా ప్రభుత్వం ఈ ప్రతిపాదనకు ఇంకా ఆమోదం తెలపలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

మొదటి పర్యాయంలోనూ..

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తన మొదటి పర్యాయంలో కూడా ఏడు దేశాలు ముఖ్యంగా మెజారిటీ ముస్లిం దేశాలకు చెందిన ప్రయాణికులపై నిషేధం విధించారు. దీనిపై న్యాయ పోరాటం సాగగా ప్రభుత్వ విధానాన్ని సుప్రీంకోర్టు 2018లో సమర్థించింది. ఈ ఏడాది జనవరి 20న అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ట్రంప్ జారీ చేసిన ఓ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో జాతీయ భద్రతా ముప్పును గుర్తించేందుకు అమెరికాలోకి ప్రవేశించే విదేశీయులకు సంబంధించి లోతుగా దర్యాప్తు జరగాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వు మేరకు పలువురు క్యాబినెట్ మంత్రులు పాక్షికంగా లేదా పూర్తిగా ప్రయాణ నిషేధం విధించాల్సిన దేశాల పేర్ల జాబితాను మార్చి 21 లోగా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. రెండవ పర్యాయం అధికారంలోకి రాగానే అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపిన ట్రంప్ అందులో భాగంగానే అనేక దేశాలపై ప్రయాణ నిషేధం విధించేందుకు సంసిద్ధమవుతున్నారు. రెండవ పర్యాయం అధికారంలోకి రావడానికి ముందు 2023 అక్టోబర్‌లో ఓ ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ మాట్లాడుతూ గాజా స్ట్రిప్, లిబియా, సోమాలియా, యెమెన్‌తోపాటు తమ దేశ భద్రతకు ముప్పు తీసుకువచ్చే ఏ దేశానికి చెందిన పౌరులనైనా అమెరికాలోకి రాకుండా అడ్డుకుంటామని తెలిపారు.

50 రోజుల్లోనే అల్లకల్లోలం

ట్రంప్ పాలనా తీరుపై మీడియా విమర్శలు

వాషింగ్టన్, మార్చి 15: 'వైట్ హౌస్ (అమెరికా అధ్యక్ష భవనం) 'ఫైట్ హౌస్'గా మారింది. మంత్రులు 'సహ అధ్యక్షుడు' ఎలాన్ మస్క్‌తో క్యాబినెట్ రూమ్‌లోనే గొడవ పడుతున్నారు. ఈ కొట్లాటలు అధ్యక్షుడు, మరో 20 మంది అధికారుల ముందే పబ్లిక్‌గా జరుగుతున్నాయి. మునుపెన్నడూ లేని రీతిలో పరిపాలనపై బహిరంగంగా అసమ్మతి వ్యక్తమవుతున్నది' అని డొనాల్డ్ ట్రంప్ 50 రోజుల పాలనపై న్యూయార్క్ టైమ్స్ పత్రిక వ్యాఖ్యానించింది. వైట్‌హౌస్‌లో విదేశీ ప్రముఖులపై విచారణ జరుపుతూ, వారిని బహిష్కరిస్తున్నారని తెలిపింది. రాబోయే దినాల్లో వైట్ హౌస్‌ను టెస్లా షోరూమ్‌గా పొరబడే అవకాశం లేకపోలేదని పేర్కొంది. ట్రంప్ తన దౌత్య నీతిని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడిస్తున్నారని విమర్శించింది. ఆయన చేసే ట్వీట్లు ప్రపంచ స్టాక్‌మార్కెట్లను అల్లకల్లోలం చేశాయని తెలిపింది. ఆయా దేశాలపై టారిఫ్‌లు విధిస్తాం, తొలగిస్తాం అంటూ ఇష్టం వచ్చిన రీతిలో ట్వీట్లు చేయడంతో కొన్ని లక్షల కోట్లు ఆవిరైపోయాయని పేర్కొంది.ట్రంప్ తన అసంబద్ధ విధానాలతో దీర్ఘకాలిక మిత్రులను దూరం చేసుకొని, ప్రత్యర్థులకు అండగా నిలిచారని పేర్కొంది.

ఇరాక్‌లో ఐసిస్ అగ్రనేత హతం

న్యూఢిల్లీ, మార్చి 15: అమెరికా సారథ్యంలోని సంకీర్ణ దళాలలో పనిచేస్తున్న తమ దేశానికి చెందిన జాతీయ నిఘా సర్వీసు సిబ్బంది ఇరాక్, సిరియా దేశాల ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) అగ్ర నాయకుడిని చంపివేసినట్టు ఇరాక్ ప్రధాని శనివారం ప్రకటించారు. తమ దేశంలో చీకట్లను, ఉగ్రవాదాన్ని నింపుతున్న శక్తులకు తమ దేశ పౌరులే శిక్ష విధిస్తున్నారని ఎక్స్ వేదికగా ప్రధాని మొహమ్మద్ షియా అల్ సుడానీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కి డిప్యూటీ కలీఫ్‌గా పనిచేస్తున్న అబ్దుల్లా మకీ మొస్లే అల్ రిఫాయి లేదా అబూ ఖదీజాను సంకీర్ణ దళాలు మట్టుపెట్టినట్టు ఆయన తెలిపారు.

214 మంది పాక్ సైనికులను చంపేశాం

బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన

క్వెట్టా, మార్చి 15: పాకిస్థాన్‌కు చెందిన ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసిన బలూచ్ వేర్పాటువాదులు తమ బందీలుగా ఉన్న 214 మంది పాకిస్థానీ సైనికులను చంపివేసినట్టు ప్రకటించారు. పాక్ జైళ్లలో ఉన్న బలూచ్ రాజకీయ ఖైదీల విడుదలకు తాము ఇచ్చిన 48 గంటల గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసిపోవడంతో తమ బందీలుగా ఉన్న 214 మంది పాక్ సైనికులను అంతం చేశామని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(ఈఎల్ఏ) శనివారం ప్రకటించింది. రైలు హైజాక్ సుఖాంతమైనట్టు పాకిస్థానీ సైన్యం చేసిన ప్రకటనను బీఎల్ఏ ఖండించింది. తమ హెచ్చరిక పట్ల పాకిస్థానీ ప్రభుత్వ మొండివైఖరి కారణంగానే తాము ఈ చర్య తీసుకోవలసి వచ్చిందని బీఎల్ఏ పేర్కొంది. పాకిస్థానీ సైన్యం అపహరించిన బలూచ్ రాజకీయ ఖైదీలు, హక్కుల కార్యకర్తలను విడుదల చేస్తేనే తమ అధీనంలో ఉన్న బందీలను విడుదల చేస్తామని హెచ్చరిస్తూ బుధవారం బీఎల్ఏ పాకిస్థాన్ ప్రభుత్వానికి 48 గంటల గడువు విధించింది. అయితే పాకిస్థాన్ ఎప్పటిలాగే తన మొండివైఖరిని, సైనిక దురహంకారాన్ని ప్రదర్శిస్తూ వాస్తవ పరిస్థితులను పూర్తిగా విస్మరించిందని బీఎల్ఏ తన తాజా ప్రకటనలో తెలిపింది. ఈ ఆపరేషన్‌లో తమ సహచరులు 12 మంది మరణించారని బీఎల్ఏ తెలిపింది. తమకు బందీలుగా చిక్కిన పాక్ సైనికులను ప్రత్యేక బోగీలలోకి ఎక్కించి తమ సిబ్బంది కాపలా కాస్తున్నారని, మిగిలిన బందీలను వేరే సురక్షిత ప్రదేశానికి తరలించామని బీఎల్ఏ తెలిపింది. తమపై యుద్ధానికి వచ్చిన పాకిస్థాన్ కమాండోలను తమ ఫిదాయీలు అంతం చేశారని పేర్కొంది.

లొంగిపోతే ప్రాణాలతో ఉంటారు!

ఉక్రెయిన్ దళాలకు పుతిన్ సూచన

మాస్కో, మార్చి 16: కుర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ సైనిక బలగాలు తమకు లొంగిపోవాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం హెచ్చరించారు. అలా చేస్తే వారికి భద్రత కల్పిస్తామని, మానవతతో వ్యవహరిస్తామని ఆయన వాగ్దానం చేశారు. ఉక్రెయిన్ సైనికులపై కనికరం చూపాలని ట్రంప్ కోరిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'వారు కనుక ఆయుధాలు వదిలి లొంగిపోతే, వారి ప్రాణాలు నిలుస్తాయి. వారికి గౌరవప్రదమైన మర్యాద దక్కుతుంది' అని అన్నారు. అయితే తమ బలగాలను చుట్టుముట్టారంటూ వస్తున్న వార్తలను ఉక్రెయిన్ మిలిటరీ తిరస్కరించింది.

నువ్వు ఇంకా పుట్టి ఉండవు

- ద్విభాషా విధానంపై 1968లోనే బిల్లుకు మా అసెంబ్లీ ఆమోదం
- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌పై డీఎంకే నేత ఇళంగోవన్ ఫైర్
- తమిళ సినిమాల డబ్బింగ్ వ్యాఖ్యలపై తీవ్రస్పందన

చెన్నై: భాషా వివాదంలో జోక్యం చేసుకుంటూ జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తమిళనాడుపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో దుమారం రేపాయి. పవన్ వ్యాఖ్యలపై అధికార డీఎంకే తీవ్రంగా స్పందించింది. పార్టీ వ్యవస్థాపక దినోత్సవంలో పవన్ ప్రసంగిస్తూ తమిళనాడు రాజకీయ నాయకులు ఆత్మవంచనకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆర్థిక ప్రయోజనాల కోసం తమిళ చిత్రాలు హిందీలోకి డబ్బింగ్ జరగడానికి అనుమతించే తమిళనాడు నాయకులు హిందీ భాషను మాత్రం వ్యతిరేకిస్తారని ఆయన అన్నారు. దేశ సమైకృత కోసం తమిళంతో సహ బహుళ భాషలు దేశానికి అవసరమని పవన్ అన్నారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) అమలుపై తమిళనాడులో అధికార డీఎంకే, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం రాజుకున్న నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శిస్తూ పవన్ చేసిన వ్యాఖ్యలపై డీఎంకే ఘాటుగా స్పందించింది. 1938 నుంచి హిందీని తమిళనాడు వ్యతిరేకిస్తోందని డీఎంకే నాయకుడు టీకేఎస్ ఇళంగోవన్ శనివారం వివరించారు. మొదటి నుంచీ తమిళనాడు ద్విభాషా విధానాన్నే పాటిస్తోందని ఆయన చెప్పారు. పాఠశాలల్లో తమిళం, ఇంగ్లిష్‌లో బోధనలు ఉంటాయని, ఇందుకు సంబంధించిన బిల్లు పవన్ కల్యాణ్ పుట్టక ముందే తమిళనాడులో ఆమోదం పొందిందని ఆయన వ్యాఖ్యానించారు. ద్విభాషా సూత్రాన్ని పాటిస్తామని తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేసుకున్నామని ఆయన చెప్పారు. విద్యారంగంలో సూచనల కారణంగా ద్విభాషా విధానాన్ని అమలుచేస్తున్నామే తప్ప సినిమా నటులు చెప్పారని కాదని ఆయన స్పష్టం చేశారు. 1968లో బిల్లు ఆమోదం పొందినపుడు పవన్ పుట్టి ఉండకపోవచ్చని డీఎంకే నేత వ్యాఖ్యానించారు. తమిళనాడు రాజకీయాల గురించి ఆయనకేం తెలుసన్నారు. పవన్ వ్యాఖ్యలపై మరో నటుడు ప్రకాష్ రాజ్ స్పందిస్తూ మీ హిందీని మా మీద రుద్దవద్దని చెప్పారు. హిందీని వ్యతిరేకించడమంటే మరో భాషను ద్వేషించినట్టు కాదని తెలిపారు. మన మాతృభాషను, మన సాంస్కృతిక ఉనికిని గర్వంతో పరిరక్షించుకోవడమని చెప్పారు.



కెనడా మంత్రులుగా ఇద్దరు భారత సంతతి ఎంపీలు

అనిత ఆనంద్, కమల్ ఖేరాలకు చోటు

ఒట్టావా: కెనడా నూతన ప్రధాన మంత్రి మార్క్ కార్నీ మంత్రివర్గంలో ఇద్దరు భారత సంతతి ఎంపీలకు స్థానం లభించింది. ఇండో-కెనడియన్ అనిత ఆనంద్, ఢిల్లీలో జన్మించిన కమల్ ఖేరాలకు మంత్రి పదవులు లభించాయి. కార్నీ, ఆయన మంత్రివర్గ సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అనితకు ఇన్నోవేషన్, సైన్స్, పరిశ్రమల శాఖ, కమల్ ఖేరాకు ఆరోగ్య శాఖ ఇచ్చారు. మంత్రి పదవులను నిలబెట్టుకున్న కొద్ది మందిలో వీరిద్దరూ ఉన్నారు. కమల్ బాల్యంలోనే ఆమె తల్లిదండ్రులు కెనడాకు వలస వెళ్లారు. పార్లమెంటుకు ఎన్నికైన అత్యంత పిన్న వయస్కులైన మహిళలలో ఆమె ఒకరు. లిబరల్ పార్టీలో ప్రధాని పదవికి పోటీలో ముందున్న అనిత జనవరిలో తాను పోటీలో లేనని ప్రకటించారు.

కోట్లు కురిపించిన బోట్లు!..

షాకిచ్చిన ఐటీ నోటీసులు

ప్రయాగ్‌రాజ్: మహా కుంభమేళాలో బోట్లు నడిపే ఓ కుటుంబం రూ.30 కోట్లు సంపాదించినట్టు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీ వేదికగా ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఆ కుటుంబానికి ఐటీ శాఖ షాక్ ఇచ్చింది. 12.8 కోట్లు పన్ను చెల్లించాలంటూ నోటీసులు పంపింది. ప్రయాగ్‌రాజ్‌కు చెందిన పింటూ మహరా కుటుంబానికి 130 పడవలు ఉన్నాయి. మహా కుంభమేళా జరిగిన 45 రోజులు త్రివేణీ సంగమానికి పడవలు నడిపిన ఈ కుటుంబం దాదాపు రూ. 30 కోట్లు సంపాదించింది. ఐటీ అధికారులు టిప్పు సంపాదన గురించి తెలుసుకుని ఐటీ చట్టంలోని 4, 68 సెక్షన్ల కింద రూ.12.8 కోట్ల పన్నులు చెల్లించాలని నోటీసులు ఇచ్చారు. దీంతో షాక్‌లో ఉన్న పింటూ కుటుంబం అంత డబ్బు ఎక్కడి నుంచి కడుతుందని సెబీ రిసెర్చ్ అనలిస్ట్ ఏకే మంధన్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఐటీ శ్లాబ్‌లు, నిబంధనల గురించి ఏమీ తెలియని పింటూ సంపాదించిన సొమ్ములో ఖర్చులు పోను ఇక మిగులుబ్కున్నదేమిటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఈసారి నీటి చార్జీల వడ్డన

- బెంగళూరులో రూ.500 వరకు పెంచిన సిద్ధరామయ్య సర్కార్
- తక్కువే పెంచామంటూ సమర్థన

బెంగళూరు, మార్చి 15: కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై మరో చార్జీల భారాన్ని మోపింది. ఒక వైపు ఐదు గ్యారెంటీలు ఇస్తున్నామంటున్న సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం.. ఆర్టీసీ, మెట్రో, పాలు, మద్యం, ఆస్తి రిజిస్ట్రేషన్, వాహనాల రిజిస్ట్రేషన్, దవాఖాన సర్వీసు చార్జీలు, ఈవీ వాహనాల పన్ను, విద్యుత్తు చార్జీలు, ఆస్తి పన్నును ఇప్పటికే గణనీయంగా పెంచింది. ఇప్పుడు ధరలు పెరగడం నీటి చార్జీల వంతు. నీటి బిల్లులను నెలకు రూ.500 వరకు పెంచుతున్నట్టు బెంగళూరు వాటర్ సప్లయి అండ్ సీవరేజ్ బోర్డు (బీడబ్ల్యూఎస్ఎస్‌బీ) ప్రకటించింది. తొలుత ప్రకటించిన దానికన్నా ఇది చాలా తక్కువని, పైగా 2014 నుంచి నీటి చార్జీలను పెంచలేదంటూ ప్రభుత్వం తన చర్యలను సమర్థించుకుంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శుక్రవారం ఈ చార్జీల పెంపును వెల్లడించారు. లీటర్‌కు 7 నుంచి 8 పైసలు పెంచుతామంటూ ప్రచారం జరిగిందని, కానీ తాము కేవలం ఒక్క పైసాను మాత్రమే పెంచామని ఆయన చెప్పారు. బీబీఎంపీ బడ్జెట్ త్వరలోనే ఉందని, ఈ క్రమంలో బెంగళూరు ఎంఎల్ఏలతో చర్చించి సవరించిన చార్జీలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ నీటి చార్జీల పెంపు కారణంగా ప్రతి ఇంటికి 400 నుంచి 500 రూపాయలు అదనంగా బిల్లు వస్తుందని అంచనా వేస్తున్నారు. నిర్వహణా ఖర్చులు పెరిగిపోవడం, బోర్డుపై ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి చార్జీలు పెంచక తప్పలేదని శివకుమార్ తెలిపారు. ముఖ్యంగా పెరిగిన విద్యుత్తు చార్జీల వల్ల బోర్డుపై భారం ఎక్కువ పడుతున్నదని, బోర్డు ఇప్పటికే ఏడాదికి వెయ్యి కోట్ల నష్టాలను ఎదుర్కొంటున్నదని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌లో కొందరు సభ్యుల ఆందోళనను ఆయన ప్రస్తావిస్తూ బెంగళూరులోని చాలామంది అపార్ట్‌మెంట్ బిల్డర్లు నీటి పన్నును నివాసితుల నుంచి వసూలు చేస్తున్నా బోర్డుకు కట్టడం లేదని చెప్పారు. మరికొందరు అక్రమ కనెక్షన్లతో నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరానికి ఎలాంటి ఆటంకం లేకుండా నీటి సరఫరాకు, అప్పుల భారం నుంచి బయటపడటానికి నీటి చార్జీలు పెంచక తప్పలేదని శివకుమార్ స్పష్టం చేశారు.

వియత్నాంపై అంత ప్రేమ ఎందుకో?

రాహుల్ గాంధీని ప్రశ్నించిన బీజేపీ

న్యూఢిల్లీ: లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ ఏడాదిలో రెండోసారి వియత్నాంకు వెళ్లడంపై బీజేపీ అనుమానాలు వ్యక్తం చేసింది. బీజేపీ ఎంపీ రవి శంకర్ ప్రసాద్ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'రాహుల్ గాంధీ హోలీ పండుగ సమయంలో వియత్నాంలో ఉన్నట్లు తెలిసింది. నూతన సంవత్సర వేడుకల సమయంలో కూడా ఆయన ఆ దేశంలో ఉన్నారు. ఆయన తన నియోజకవర్గంలో కన్నా వియత్నాంలోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. వియత్నాం అంటే అంత ప్రేమ ఎందుకో ఆయన వివరించాలి' అన్నారు. రాహుల్ పదే పదే వియత్నాంకు వెళ్తుండటం చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణానంతరం దేశం జాతీయ సంతాప దినాలను పాటిస్తున్న సమయంలో రాహుల్ వియత్నాం వెళ్లారు.

హమాస్‌కు మద్దతు..

భారత విద్యార్థిని వీసా రద్దు

వాషింగ్టన్: కొలంబియా యూనివర్సిటీలోని భారత డాక్టొరల్ విద్యార్థిని రంజని శ్రీనివాసన్ వీసాను ఉపసంహరించుకున్నట్టు హోమ్ ల్యాండ్ సెక్యూరిటీ శాఖ(డీహెచ్ఎస్) వెల్లడించింది. దీంతో ఆమె సీబీపీ హోమ్ యాప్ సాయంతో స్వీయ బహిష్కరణ చేసుకుందని తెలిపింది. రంజని హమాస్ సంస్థకు మద్దతు తెలిపే కార్యకలాపాల్లో పాల్గొన్నందున ఆమె వీసాను ఈ నెల 5న ఉపసంహరించామని, దీంతో ఆమె స్వీయ బహిష్కరణకు గురైనట్టు చెప్పింది. ఎఫ్-1 స్టూడెంట్ వీసా ద్వారా ఆమె అమెరికాలో చదువుకుంటుందని తెలిపింది. 'మా దేశానికి చదువుకొనేందుకు వచ్చిన వారికి వీసా సౌకర్యం కల్పిస్తాం. అయితే మీరు ఉగ్రవాదాన్ని, హింసను సమర్థించినప్పుడు, ఆ ప్రత్యేక హక్కును రద్దు చేస్తాం. అలాంటి వారు ఈ దేశంలో ఉండకూడదు' అని డీహెచ్ఎస్ సెక్రటరీ తెలిపారు.

డ్యాన్స్ చెయ్.. లేకుంటే సస్పెండ్!

కానిస్టేబుల్‌కు లాలూ కుమారుడి ఆదేశం

పాట్నా: బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కొడుకు, ఆర్జేడీ నాయకుడు తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ శుక్రవారం హోలీ వేడుకలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. పార్టీ మద్దతుదారులతో కలిసి ఆయన హోలీ జరుపుకుంటున్నప్పుడు అక్కడే ఉన్న ఓ పోలీస్ కానిస్టేబుల్‌ను ఒక పాటకు నృత్యం చేయాలని, అందుకు నిరాకరిస్తే సస్పెండ్ అవుతావని బెదిరించారు. తన ఆదేశాలకు ఏమీ అనుకోవద్దని.. ఇది హోలీ పండగని ఆయన కానిస్టేబుల్‌తో అన్నారు. తేజ్ మాటలతో ప్రభావితమైన ఆ కానిస్టేబుల్ కాసేపు ఆర్జేడీ కార్యకర్తలతో కలిసి నృత్యం చేశారు. ఈ ఘటనపై బీజేపీ, జేడీయూ స్పందిస్తూ.. అధికారం లేకున్నా లాలూ కుటుంబం తీరు మారలేదన్నారు.

మాజీ ఎంపీపై కుల బహిష్కరణ వేటు

గిరిజనేతరురాలిని పెండ్లి చేసుకున్నందుకు శిక్ష

భువనేశ్వర్: ఒడిశాలోని నబరంగ్‌పుర్ మాజీ ఎంపీ, బీజేడీ నేత ప్రదీప్ మాఝీపై గిరిజన సంఘం కుల బహిష్కరణ వేటు వేసింది. కేంద్రపారా జిల్లాకు చెందిన సంగీత సాహును ప్రేమించిన ప్రదీప్ మార్చి 12న గోవాలో వివాహం చేసుకున్నారు. ఆమె గిరిజనేతరురాలు కావడంతో గిరిజన భత్ర సమాజ్ వ్యతిరేకించింది. ఈ సమాజ్ కేంద్ర కమిటీ సమావేశమై ప్రదీప్‌తోపాటు ఆయన కుటుంబంలో మరికొందరు కూడా గిరిజనేతరులను వివాహం చేసుకున్నట్లు నిర్ధారించుకున్నారు. ఈ కుటుంబ సభ్యులందరినీ 12 ఏండ్లపాటు తమ సంఘం నుంచి బహిష్కరించినట్లు ప్రకటించారు. ప్రదీప్ సోదరుడు ప్రసన్న స్పందిస్తూ.. ఈ తీర్పునకు కట్టుబడి ఉంటామని చెప్పారు.

అమెరికాలో తుఫాన్ బీభత్సం

16 మంది మృతి

ఓక్లహామా సిటీ : అమెరికాలోని అనేక ప్రాంతాల్లో శనివారం పెను తుఫాన్ బీభత్సం సృష్టించింది. దాదాపు 16 మంది మరణించారు. ఇళ్లు, దుకాణాలు, రోడ్లు దెబ్బతిన్నాయి. మిస్సోరీలో 10 మంది మరణించగా, అనేక మంది గాయపడ్డారు. ఆర్కాన్సాస్‌లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు, 29 మంది గాయపడ్డారు. టెక్సాస్‌లోని అమరిల్లోలో శుక్రవారం దుమ్ము చెలరేగడంతో ఓ కారు ఢీకొని ముగ్గురు మరణించారు. కెనడా నుంచి టెక్సాస్ వైపునకు గంటకు 130 కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

త్వరలో భూమ్మీదకు సునీతా విలియమ్స్

వాషింగ్టన్: భారత సంతతి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ త్వరలోనే భూమి మీదకు తిరిగి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం నాసా-స్పేస్ఎక్స్ శుక్రవారం క్రూ-10 మిషన్ చేపట్టాయి. కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్‌ను శుక్రవారం రోదసిలోకి పంపాయి. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సునీతా విలియమ్స్, విల్‌మోర్ తొమ్మిది నెలలుగా చిక్కుకుపోయారు.